నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 1
ఆదివారం 25 జూన్ 2023

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని బట్టు తండాలో శనివారం సీసీ రోడ్డు పనులను స్థానిక సర్పంచ్ రాతుల రెడ్డి నాయక్ స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం మారుమూల ప్రాంతాలైన తండాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందని, ప్రభుత్వ విప్ గంప గోవర్ధ సహకారంతో గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ పది లక్షల సీసీ రోడ్డు పనులను ప్రారంభించామని, ఈ సందర్భంగా గంప గోవర్ధన్ కు గ్రామం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లచ్చిరాం, బి ఆర్ ఎస్ నాయకులు చంద్రు నాయక్, సంతోష్ నాయక్, రవి నాయక్, బన్సీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందానికి సహకరించాలి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీలో భాగంగా జరిగే ప్రతి పనిలో సామాజిక తనిఖీ బృందానికి పూర్తి సమాచారం అందించి సహకరించాలని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధి హామీ సిబ్బంది గ్రామ కార్యదర్శిల తో సమావేశం నిర్వహించారు. మండలానికి సామాజిక తనిఖీ బృందం వారు వచ్చారని సామాజిక అతనికి బృందానికి గ్రామ సర్పంచ్ కార్యదర్శి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు సిబ్బంది సహకరించాలని కోరారు. ఎన్ఆర్ఈజీఎస్ 15వ విడతలో బాగంగా సామాజిక తనిఖీ బృందం ఫిబ్రవరి 2020 నుంచి 2023 ఫిబ్రవరి వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై వీరు పరిశీలిస్తారు. ఈ కార్యక్రమంలో సామాజిక తనిఖీ బృందం అధికారులు గ్రామ కార్యదర్శులు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

ఎర్రజెండాతోనే ఇండ్లు, ఇండ్ల స్థలాలు సాధ్యం

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్‌రాములు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



గత కొన్ని సంవత్సరాలుగా పట్టణంలోని గల్లీ గల్లీలలో, గ్రామాల్లో తిరిగి ఎక్కడ ప్రభుత్వ ఖాళీ జాగా కనిపిస్తే అక్కడ పాత చీరలు, పాత బట్టలు, కర్రలు ఎర్రజెండాలు, ఏది దొరుకుతే అది అక్కడ చూపించి ఈనాటికీ రాష్ట్రంలో 50వేల వరకు గుడిసెలు ఉన్నాయంటే కారణం ఎర్రజెండానే. ఎర్రజెండా పోరాట పటిమ తర్వాత లక్షలాది పేదలకు లక్షలాది ఎకరాలలో గుడిసెల నిర్మాణం జరిగిందంటే దానికి మన అకుంఠిత దీక్ష. ప్రస్తుతం గత మూడు సంవత్సరాలకు పైగా పేదల ఇళ్ళ నిర్మాణ కోసం జాగల పట్టాల కోసం పోరాడుతుంటే ప్రభుత్వానికి ఇంగిత జ్ఞానం కూడా లేదు. కేంద్రంలో బిజెపి రేషన్ కార్డుకు సంబంధించిన బియ్యము ఇయ్యను అంటుంది కానీ ఆ రేషన్ కార్డు పైన ఆధారపడి బతికే పేద జీవులు ఎన్నో లక్షల మంది ఉన్నారు. ఈరోజు నేను ఈ వేదిక సాక్షిగా ధర్మపురి అరవింద్‌కు, తెలంగాణా నుండి మంత్రిగా ప్రాతినిత్యం వహిస్తున్న కిషన్ రెడ్డికి అడుగుతున్నాను.. మీరు జాగాలు ఇచ్చారా? నిర్మాణం కోసం డబ్బులు ఇచ్చారా? పేద ప్రజల్ని ఆదుకున్నారా? మీ ప్రభుత్వం పేదలకు వ్యతిరేకం! నిన్న కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం గెలిస్తే రేషన్ కార్డు, బియ్యం ఇయ్యం అన్నారు. తెలంగాణకు కూడా అంటున్నారు.



రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన సభలో అభివాదం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఇండ్ల స్థలాలు ఇప్పుడు సాధించుకోకుంటే జానడు జాగా దొరకదు

- సమరశీల పోరాటాలకు సిద్ధం కండి
- బడాబాబుల సేవలో మోడీ
- భూముల అమ్మకంలో కేసీఆర్ బిజీ
- 27లోగా ఇండ్ల స్థలాల పంపిణీపై ప్రకటన చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి బస్సుజాత కన్వీనర్ వీరయ్య హెచ్చరిక
- జిల్లాకు చేరిన బస్సుజాత

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి/నిజామాబాద్‌సిటీ

ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం సమరశీల ఉద్యమాలకు పేదలు సిద్ధం కావాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఇండ్ల స్థలాలు ఇప్పుడు సాధించుకోకపోతే, పేదలకు జాగడు జాగా కూడా దొరకబోదని స్పష్టం చేశారు. నగరీకరణ పథకం పేరిట కేంద్రం బడా కార్పొరేట్లకు భూములు దారాధత్తం చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం భూములు అమ్ముకుని సొమ్ము చేసుకుంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి కంటితుడుపు చర్య అని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇండ్లు లేని పేదలకు స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.15 లక్షల ఆర్థికసాయం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానం చేసినట్టుగా ఎన్నికలలోపు రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి పేదలకు పంచాలని స్పష్టం చేశారు. ఇక ఇండ్ల స్థలాల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 27లోగా నిర్దిష్టకాలపరిమితితో కూడిన అధికారిక ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన బస్సుజాతా శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చింది. అందులో భాగంగా మొదట కంఠేశ్వర్ బైపాస్ వద్ద బస్సు యాత్రకు జిల్లా నేతలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా సభ వేదిక రాజీవ్‌గాంధీ ఆడిటోరియానికి యాత్ర చేరింది. ఈ సందర్భంగా బస్సుయాత్ర కన్వనీర్ ఎస్ వీరయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలా బ్ బాబు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంక్రటాములు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, పోరాట వేదిక రాష్ట్ర నాయకులు జగదీష్, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు పర్వతాలు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నుర్జాహాన్, జిల్లా నాయకులు రమేష్‌బాబు, పెద్ది వెంక్రటాములు, గంగాధరప్ప, వెంకటేష్, సుజాత, శంకర్‌గౌడ్, గోవర్ధన్, పెద్ది సూరి, అనిల్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రకు స్వాగతం

సదాశివనగర్ : ప్రజాసంఘాల పోరాట కమిటీ చేపట్టిన బస్సు యాత్రకు సదాశివనగర్ మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలో సీపీఐ(ఎం) ఎల్లారెడ్డి నియోజకవర్గం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పోరాటాలు కొత్తేమి కాదనిఅన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఇండ్ల స్థలాలపై ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడదామని పిలుపునిచ్చారు. ముగింపు సభకు పెద్దఎత్తున ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్, రైతు కూలీ సంఘం కార్యదర్శి మోతిరాం, సిఐటియు నాయకులు బాల్ నర్స్, మల్లేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్ : పద్మాజివాడి ఎక్స్ రోడ్డు వద్ద బస్సు యాత్రకు స్వాగతం

కూడు, గూడు, గుడ్డ కోసమే పోరాటం

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



తెలంగాణ రాష్ట్రం సాధించక ముందు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామన్నారు. మనం ఓట్లేసి గెలిపించాం. తొమ్మిదిన్నర సంవత్సరాలు గడిచింది. మన ఆశలు అడియాశలయ్యాయి. డబుల్ బెడ్ రూమ్ కాదు కదా సింగిల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా ఇవ్వలేదు. ప్రభుత్వాలు 125 గజాల జాగా ఇవ్వలేకపోయారు. స్థలం ఉంటే మూడు లక్షల రూపాయలు ఇస్తామని అన్నారు. ప్రభుత్వానికి స్థలం చూసే ఓపిక లేకపోతే మేమే ప్రభుత్వ స్థలాలను గుర్తించి ప్రభుత్వానికి చూపించాం. మేమే గుడిసెలు వేసుకున్నాం. రాజ్యాంగంలో రాజ్యాంగం ప్రకారం పేద ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉంది. కానీ ఏ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. మీరు ఒకటే అడగండి ఎవరైతే జాగాలిస్తారో వారికే ఓట్లు వేస్తామని గట్టిగా చెప్పండి. ఎందుకంటే గతంలో ఉల్లిగడ్డ ధరలు పెరిగినప్పుడు మహిళలు అందరం పోరాటం చేశాం. అప్పుడు ప్రభుత్వాలు వాటి ధరలు తగ్గించాయి. ఇప్పుడు అంతే.. మనం రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేస్తే కచ్చితంగా మన జాగ మనకే ఉంటుంది. మన జాగాలు ఎక్కడికి పోవు. కొందరు నిరాశ పరుస్తారు. మీకు జాగలు రావు ఏమి రావు అని కానీ నీ పక్కన ఉన్నది ఎర్రజెండా అని మరవద్దు. పోలీస్‌లు వచ్చి గుడిసెల్ని పీకి వేసినా మనం మాత్రం జాగల్ని అంటిపెట్టుకొని ఉండాలి. ఎక్కడికి వెళ్లొద్దు. ఒకవేళ వాటిని విడిచిపెడితే గద్ద కోడి పిల్లల్ని ఎత్తుకుపోయినట్లు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికారులు, ప్రభుత్వాలు మన జాగాలను తన్నుకు పోతాయి. కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలను వంచి మన జాగా మనం సాధించే వరకు పోరాటం చేయాలి. కేంద్ర ప్రభుత్వం 2022 డిసెంబర్ 31 నాటికి ఆవాస్ యోజన పథకం కింద ఇండ్లు ఇస్తాము అని అన్నారు. ఇచ్చేవరకు మనం పోరాటం చేయాలి.

పేదల ఇళ్లను కూల్చారు.. కాల్చారు

- ముగింపు సభ అంతం కాదు.. ఆరంభం : కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి సైలాబ్ బాబు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



మన పోరాటంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ,రౌడీలు, గుండాలు, పోలీసులు, అధికారులు, ప్రభుత్వాలు, దాడులు చేస్తారు. మన ఐక్యత దెబ్బతినకుండా పోరాటం చేస్తూనే ఉండాలి. ప్రభుత్వాలు రాజ్యాంగ హక్కులను విస్మరించాయి. కనీసం గుడిసెలైనా నిర్మించడానికి ముందుకు రావడం లేదు. ఒక్క ఇల్లు లేవు. మనము జాగలున్నచోట చీరలు కట్టాం, కట్టలు పెట్టాం. ప్రతి చోట ఇల్లు నిర్మించుకునే ప్రయత్నం చేస్తున్నా పాములు తేళ్ల ఉన్నాయు అయినా ధైర్యంగా ఉండాలి. వరంగల్లోని సమ్మయ్య నగరంలో భార్యాభర్తల పైన కేసులు పెట్టారు. ఇల్లు కూల్చారు. కాల్చారు. రెండు సంవత్సరాలు పోరాటం చేశారు. భర్త చనిపోయినా భార్య ముగ్గురు బిడ్డల పెళ్లిలు చేసింది. ఎలా చేశావమ్మా అని అడిగితే 100 గజాల అమ్మితే 28 లక్షల రూపాయలు వచ్చాయి అని అన్నది. ఆరోజు లాటి దెబ్బలకు పోలీస్ బూట్ల దెబ్బలకు మేము తలొగ్గితే ఈరోజు ఈ డబ్బులు వచ్చేవి కావు. ఎర్ర జెండా పోరాట ఫలితమే మాకు భవతీ భిక్షాందేహి అనే పరిస్థితి లేకుండా పోరాటం ద్వారా సాధించుకుందాం. అరవింద్‌కు సూటిగా అడుగుతున్నాను.. ఈ వేదికనుండి మా పేద ప్రజలకు ఇల్లు నిర్మించుకోవడానికి 125 గజాల జాగా లేకపోతే మీ నరేంద్ర మోడీకి ఢిల్లీలో నడి బొడ్డున 465 కోట్లతో ఇల్లు ఎలా నిర్మిస్తారు..? రాజ్యాంగం లోని ఆర్టికల్ 21 ప్రకారం స్వేచ్ఛగా జీవించాలని చెప్పింది. కానీ మీరు మా స్వేచ్ఛను హరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అడుగుతున్నాం.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కచ్చితంగా పేదలకు పంచాలి. ఆ కట్టిన ఇళ్లలో తాళాలు ఊసిపోతున్నాయి. గొల్లాలు పడిపోతున్నాయి. మేము 15 లక్షల రూపాయలు ఇవ్వాలని చెప్పేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేస్తున్నాం. జూన్ 27వ తారీకు లోపల రాష్ట్ర ప్రభుత్వం నుంచి వీధి విధానం ప్రకటన స్పష్టంగా నిర్దిష్ట ప్రకటన రావాలి. లేకపోతే ముగింపు సభ నుండి పోరాటం ఆరంభమవుతుంది.

ప్రభుత్వ భూమి.. ప్రజల భూమి

- ఇంటింటా బీజేపీని ప్రశ్నించాలి : డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



ఇంతవరకు మనం ఎన్నో యాత్రలను చూశాం. పాదయాత్రలను చూశాం. బస్సు యాత్రలను చూశాము. ఆ యాత్రలు వారి స్వార్థం కోసం. కానీ ఈరోజు మన బస్సు యాత్ర పేద ప్రజల జాగల కోసం. పేద ప్రజల ఇళ్ల కోసం. మనం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీస్తున్నాం. మనం అద్దె కొంపలో ఉంటూ మన చేసిన కష్టం మొత్తం కిరాయి కట్టుకుంటున్నాము. ఒకే ఇంట్లో ఆరు నుంచి ఏడుగురు సభ్యులము ఉంటున్నాం. ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు, బడా బడా వ్యాపారవేత్తలు పెద్ద పెద్ద భవంతులు నిర్మించుకుంటున్నారు. కానీ వారి ముందు మన గుడిసెలు ఉండడానికి ఇష్టపడటం లేదు. ఈరోజు తొమ్మిదిన్నర సంవత్సరాలు గడిచిన తర్వాత బిజెపి వారు ఇంటింటికి బిజెపి అని వస్తున్నారు. మనం వారిని అక్కడే నిలదీయాలి. మా జాగలు ఎక్కడ అని ప్రశ్నించారు. జీవో నంబర్ 58 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలి. మా ఇల్లు ఎక్కడ..? పట్టాలెక్కడ..? మా ఇళ్ళ నిర్మాణానికి డబ్బులు ఎక్కడ అని మనం రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలి. ఈ మధ్యనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి ప్రకారం మూడు లక్షలతో ఇల్లు కట్టిస్తారట.. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని వందల వేళ ఇల్లు నిర్మించడానికి గంపగుత్తగా ఒక్క ఇంటి నిర్మాణానికి 8,50,000 ఖర్చు అయితే మన ఇంటికి మాత్రం మూడు లక్షల రూపాయలు ఇస్తే ఇప్పుడు ఉన్న ధరలలో సిమెంటు ధరలు, ఇసుక ధరలు ఆకాశాన్ని అంటాయి ఏవిధంగా ఇళ్లను నిర్మించుకుంటాం..? మన నిర్మాణం నిర్మించుకున్న ఇళ్లను అధికారులు బుల్డోజర్లతో దాడులు చేస్తున్నారు. ఇప్పడికైనా 125 గజాల జాగాలు ఇవ్వాలని అలాగే జాగాలు ఉంటే ఇల్లు నిర్మించుకోవడానికి 15 లక్షల రూపాయలు ఇవ్వాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాం.

పోలీస్ కేసులు మాకో లెక్క కాదు

- ప్రజాసంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకులు జగదీశ్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



మన పేద ప్రజలు దుబ్బలో నాలుగు ఎకరాలలో గుడిసెలు వేసుకున్నారు. ఆ జాగలు మనకు ఎవరు ఇచ్చేది కాదు.. మనమే తీసుకున్నాం. మనమే 2160 సర్వే నెంబర్ నాగారంలో బహుజన కాలనీ అని ప్రభుత్వ భూములలో పేద ప్రజలకు పంచాం. పేదలు ఆరుసార్లు గుడిసెలు వేసారు. పోలీసులు అధికారులు ఎన్నిసార్లు దాడులు చేసినా జాగలను వదలలేదు. ఎండ, వాన, చలి తట్టుకొని ఉన్నారు. పోలీస్ దెబ్బలను తట్టుకున్నాం. మనది పొరాట చరిత్ర. మనం పోరాటం చేస్తే ఖచ్చితంగా మనం సాధిస్తాం. ఈ మధ్యనే తలసాని శ్రీనివాస్ యాదవ్ సర్కారు ఇల్లు కడితే ఒక్క ఇంటికి ఎనిమిది లక్షల 50 వేల రూపాయలు ఖర్చు అవుతుందని చెప్పారు. మరి మనకు మూడు లక్షల రూపాయలు ఎలా ఇస్తారు..? కావున కనీసం మనకు 15 లక్షల రూపాయలు ఇవ్వాలి. మేము పేద ప్రజల కోసం పోరాడితే మాపైన పోలీస్ కేసులు పెట్టారు. మాకు పోలీస్ స్టేషన్ లెక్కకు లెక్క కావు పోలీస్ కేసులను వెంటనే ఎత్తివేయాలి. మనం వర్షం వచ్చినా.. కరెంటు లేకపో యినా సభను ఎలా చివరి వరకు ముగించుకున్నామో ఆదే పోరాట ప్రతిమతో మడమ తిప్పకుండా మన లక్ష్యాన్ని సాధించే వరకు మనం పోరాటం చేయాలి.

ప్రభుత్వమే పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



గుడిసెలు వేసుకుని జీవనం కొనసాగిస్తున్న పేదలకు ప్రభుత్వమే పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేవారు. నిజామాబాద్ నగరంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు 35వేల దరఖాస్తులు వచ్చాయి.. అందులో ప్రభుత్వం విచారణ చేపట్టి కనీసం 28 వేల మంది నిరుపేదలను గుర్తించిందని తెలిపారు. నగరంలో 500 ప్రభుత్వం ఇండ్ల నిర్మాణం చేపట్టింది అని, నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాలంటే ఇంకా చాలాకాలం సమయం పడుతుందని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు చాలా ఉన్నాయని, కిరాయిలు కట్టలేని పరిస్థితుల్లో చాలా మంది పేదలు ఉన్నారని, వారే నెహ్రూ నగర్ లో 6 నెలలుగా, దుబ్బ లో 1 నెల నుండి పూరి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నట్టు తెలిపారు. పేదలను రెవెన్యూ అధికారులు , పోలీస్ సిబ్బంది, వచ్చి పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. పేదలు ఐక్యంగా పోరాడుతేనే ఇండ్ల స్థలాలు సాధించుకుంటామని అన్నారు. నవీపేట్, జానకంపేట్‌లో దరఖాస్తు పెట్టిన పేదలకు జీవో 58 ప్రకారం ఇళ్ల స్థలాలు అందించాలని అన్నారు. ఎంపీ అరవింద్ జిల్లాను ఉద్ధరిస్తానని చెప్పి, జిల్లా కు 2 లక్షలు ఇండ్లు కట్టిస్తామని చెప్పి ఇప్పటివరకు ఎవరికీ ఒక్క ఇంటిని నిర్మించి ఇవ్వాలేదని అన్నారు.

మహిళల ఓట్లే కీలకం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



బీడీ కార్మికుల ఓట్లే చాలా కీలకం. ఇండ్ల స్థలాల కోసం మహిళలే పెద్దఎత్తున పోరాడుతున్నారు. ఇండ్ల స్థలాలు ఇచ్చిన వారికే ఓట్లు వేస్తారు. నిరుపేదలు బతకడానికి అవసరమైన నిత్యావసర ధరలను పెంచుతున్నారని ఇంటి కిరాయి కట్టుకోవడం చాలా ఇబ్బందికరంగా మారుతుందని, కరోనాకాలంలో కనీసం మరణించి వారి మృతదేహాన్ని సైతం రానివ్వలేదని అన్నారు. పేదలు గౌరవంగా బతికేందుకు ఇంటి స్థలాలు మంజూరు చేసి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలను బంగారం ఏమన్నా ఇవ్వమంటున్నామా..? ఇంటి స్థలం ఇవ్వాలి.



పేదల గుడిసెలను పరిశీలిస్తూ..









నిజామాబాద్‌సిటీ : బస్సు యాత్ర బృందానికి స్వాగతం పలుకుతున్న జిల్లా నాయకులు.. బైక్ ర్యాలీ   ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెలు పరిశీలిస్తున్న నాయకులు.. సభకు హాజరైన పేదలు

రైతులకు నేస్తం.. రైతు సేవా హస్తం

- కామారెడ్డి జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి

నవతెలంగాణ-బిచ్కుంద

న్యాయవ్యవస్థలో రైతులకు న్యాయ సలహాలు సూచనలు అందించడానికి జాతీయ సేవా సంస్థ ఆదేశాల మేరకు అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు కామారెడ్డి జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్ పర్సన్, జిల్లా న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి అన్నారు. రైతులకు నేస్తంగా మారి సేవ సంస్థ హస్తం అందిస్తుందని తెలిపారు. శనివారం మండలంలోని పెద్దదేవడ గ్రామంలోని రైతు వేదికలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ముందుగా రైతు వేదికలో ఏర్పాటు చేసిన అగ్రీ లీగల్ ఎడ్ క్లినిక్ ను ప్రారంభించారు.



అనంతరం జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి మాట్లాడుతూ రైతులు నకిలీ విత్తనాలు, ఎరువులు, పెస్టిసైడ్స్ వల్ల రైతులు పంటలను నష్టపోతే పేర లీగల్ వాలెంటరిని సంప్రదించి తగు సూచనలు పొంది న్యాయస్థానాన్ని ఆశ్రయించి నష్టపోయిన పంటల నష్టపరిహారం పొందవచ్చు అన్నారు. నష్టపోయిన రైతులు న్యాయవాదులను పెట్టుకునే స్తోమత లేని వారు ఈ సిస్టం ద్వారా న్యాయమైన సలహాలు సూచనలు అందించి కోర్టు ద్వారా రైతులకు న్యాయం చేయను న్నట్టు తెలిపారు. పారా లెగల్ వాలంటరీగా పెద్ద దేవాడ గ్రామానికి చెందిన రాజును జిల్లా జడ్జ్ ప్రొసిడింగ్ అందించి నియమిం చారు. అనంతరం రైతు వేదిక ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎంపీపీ అశోక్ పటేల్, సర్పంచ్ శివనందప్ప జిల్లా న్యాయమూర్తిని, బాన్సువాడ జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బాన్సువాడ డి.ఎస్.పి జగన్నాథ్ రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రకాష్ పటేల్, వ్యవసాయ అధికారి పోచయ్య తెలిపారు.

వాగులపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.7.20 కోట్లు

హర్షం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలం వ్యాప్తంగా పలు గ్రామాల్లో వాగులపై హై లెవల్ వంతెన(బ్రిడ్జి)ల నిర్మాణానికి రూ.7.20 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మద్నూర్ మండలంలోని గోజేగావ్ గ్రామానికి వెళ్లే వాగుపై, డోంగ్లి మండలంలోని మాదన్ ఇప్పర్గా గ్రామ వాగు పైన ఒక్కొక్క వంతెన నిర్మాణానికి మూడు కోట్ల అరవై లక్షల రూపాయల చొప్పున నిధులు మంజూరైనట్లు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. భారతదేశానికి స్వతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఆయా వాగులపై వంతెనలు లేక వర్షాకాలం వస్తే వాగులో నుండి వెళ్లలేక ప్రమాదవశాత్తు ఎందరో చనిపోయిన దాఖలాలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం జుక్కల్ ఎమ్మెల్యేగా హనుమంతు షిండే జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ వంతెన నిర్మాణాలకు కృషి చేస్తూ నిధులు మంజూరు చేయించినట్టు తెలిపారు. ఈ నిధులతో ఆయా గ్రామాల వాగులపై హై లెవెల్ వంతెనలు పూర్తయితే వర్షాకాలం వరద నీటికి ఇబ్బందులు కలగకుండా దూరమయ్యే ఆస్కారం ఆయా గ్రామాల ప్రజలకు ఏర్పడుతుందని అన్నారు.



హర్షం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

● డీఎంకు వినతి

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని ప్రతి గ్రామానికి విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ అధ్యక్షులు మీసాలె నాగేష్ డిమాండ్ చేశారు. శనివారం బోధన్ డిపో మేనేజర్ స్వామికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన్ మండలంలోని ప్రతి గ్రామానికి కూడా విద్యార్థులకు సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయానికి స్కూల్, కాలేజ్ విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌస్, సందీప్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి బీజేపీలో ఎంపీ అరవింద్



నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

"సంపర్క్ సే సమర్థన్" కార్యక్రమంలో భాగంగా శనివారం నిజామాబాద్ నగరంలో ప్రముఖ ఎముకలు, కీళ్ళ శస్త్రచికిత్సల వైద్యులు డా.మోతిలాల్ నాయక్‌ను ఎంపీ అరవింద్ వారి ఆసుపత్రిలో కలిశారు. ఈ సందర్భంగా నరేంద్ర మోడీ ప్రభుత్వ సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమ పథకాల గురించి వివరించారు. తొమ్మిదేండ్ల పాలనపై రూపొందించిన పుస్తకాన్ని అందజేశారు.

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా

● ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

● 18వ వార్డులో పర్యటన

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ అభివృద్ధిని చూసి ప్రజలు తనను ఆదరించాలని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. 'నమస్తే నవనాథపురం' కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 18వ వార్డులో పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఉదయం 18వ వార్డులో పర్యటించిన జీవన్‌రెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. స్థానిక ప్రజలు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పూలమాలలు, శాలువాలతో జీవన్‌రెడ్డిని సన్మానించారు. జై జీవనన్న, జైజై కేసీఆర్, దేశ్ కీనేత కేసీఆర్, జై తెలంగాణ' వంటి నినాదాలతో 18వ వార్డు మారుమోగింది. ఎమ్మెల్యే వార్డులో కలియ తిరుగుతూ ప్రజలను పలకరించారు. ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ వారి మంచీ చెడుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. స్థానికంగా ప్రజలు తన దృష్టికి తెచ్చిన అనేక సమస్యలను ఆయన అక్కడిక్కడే పరిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే ఏమొస్తది అని అవహేళన చేసిన వారికి ఆర్మూర్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే సమాధానమన్నారు. అభివృద్ధిని ఆదరించండి అని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రగతి వెల్లివిరుస్తున్న ఆర్మూర్ నియోజక వర్గం అభివృద్ధి, సంక్షేమానికి అసలు సిసలైన అడ్రస్‌గా మారిందన్నారు. బీఆర్ఎస్ అంటేనే బడుగులు, రైతుల సంక్షేమం అని ఆయన అభివర్ణించారు. నిరుపేదలకు ఇండ్ల స్థలాలను పంపిణీ చేస్తామని, సొంత స్థలం ఉన్న వారు ఇండ్లు నిర్మించుకో వడానికి రూ.3లక్షల చొప్పున ఇస్తున్నా మని, చేతి వృత్తులవారికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయమందిస్తున్నామని జీవన్‌రెడ్డి వివరించారు. ఆర్మూర్ అభివృద్ధిలో రాజీపడే ప్రసక్తేలేదని, పెండింగ్ పనులన్నీ అతిత్వరలో పూర్తి చేసేలా అధికారులకు బాధ్యతలు అప్పగించామని వివరించారు. కార్యక్ర మంలో ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినిత పవన్, వైస్ చైర్మన్ మున్ను, స్థానిక కౌన్సిలర్ వనం శేఖర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఖాందేశ్ శ్రీనివాస్, శ్రీనివాసరావు, యూసఫ్‌లతో పాటు ఇతర వార్డుల కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



వినతిని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ముప్కాల్

బాల్కొండ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు అర్హులైన వారి నుంచి గంటల ప్రతిపాదికన దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీటీ సైన్స్, టీజీటీ హిందీ, పీజీటీ ఫిజికల్ సైన్స్, పీజీటీ ఇంగ్లీషు పోస్టుల కోరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 26 లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అదే రోజు డెమో క్లాసులు వుంటాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

నలుగురు విద్యార్థుల డిబార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో శనివారం ఉదయం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాక్ పరీక్షల్లో 5863మంది విద్యార్థులకు గాను 5529మంది హాజరయ్యారని, 34 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం జరిగిన యూజీ 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షకు 1639మంది నమోదు చేసుకోగా 1539 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, 100 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షాల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని ప్రొఫెసర్ డాక్టర్ అరుణ తెలిపారు.

నేడు మెగా రూరల్ హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సాంపల్లి గ్రామంలో ఐఎంఏ నిజామాబాద్ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం పద కార్యక్రమంలో భాగంగా మెగా రూరల్ హెల్త్ క్యాంప్ కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో పాటు ప్రముఖులు డాక్టర్ బియన్ రావు, ఐయంఏ రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, ధర్పల్లి జడ్పీటీసీ సభ్యులు బాజిరెడ్డి జగన్ మోహన్, జెడ్పీటీసీ దాసరి ఇందిరా లక్ష్మీ నర్సయ్య, ఎంపీపీ గద్దె భూమన్న, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఏటీఎస్ శ్రీనివాస్, డాక్టర్ నీలి రామచందర్, డాక్టర్ జీటీఆర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌తోపాటు తదితరులు పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

అక్రమ కట్టడాన్ని నిలిపివేయాలని వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కేంద్రంలో విద్యానగర్ రోడ్డు అక్రమ నిర్మాణం చేశారని మున్సిపల్ కమిషనర్‌కు బీజేపీ నాయకులు శనివారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, యామద్రి భాస్కర్ తదితరులు మాట్లాడుతూ.. ఈ అక్రమ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీకి సలాం

● దొరికిన బ్యాగ్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పిన మోపాల్ వాసి

● బాధితులకు అందజేత

నవతెలంగాణ-మోపాల్



బ్యాగు అందజేస్తున్న షేక్ హైదర్

రోడ్డుపై రూ.పది కనిపిస్తేనే తీసుకుని దాచుకునే సమాజంలో.. ఓ వ్యక్తి మాత్రం తన నిజాయితీని చాటుకుని ఆదర్శంగా నిలిచాడు. 5లక్షల విలువ గల బంగారం, రూ.20వేల నగదు గల బ్యాగు దొరికితే దానిని పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పాడు. అనంతరం పోలీసుల ఆధ్వర్యంలో ఆ బ్యాగును పోగొట్టుకున్న బాధితులకు అందజేశాడు.

వివరాలిలా ఉన్నాయి.. నిజామాబాద్‌కు చెందిన వేములపల్లి శ్రీనివాస్ కుటుంబంతో కలిసి బాసర దేవస్థానానికి దైవదర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణం ఆటోలో వస్తుండగా వారి వద్ద గల బ్యాగును పోగొట్టుకున్నారు. ఆ బ్యాగులో దాదాపు 5 లక్షల విలువ గల బంగారం, రూ.20వేల నగదు, ఏటీఎం కార్డు తదితర వస్తువులు అందులో ఉన్నాయి. మోపాల్ మండలానికి చెందిన సిరిపూర్ వాసి అయిన షేక్ హైదర్ ధర్మాబాద్ రూట్ నుంచి బాసర మీదుగా నిజామాబాద్ వచ్చే క్రమంలో అతనికి ఆ బ్యాగు మార్గమధ్యలో దొరికింది. దానిని వెంటనే తీసుకొని మోపాల్ పోలీస్‌స్టేషన్లో అప్పగించారు. అతని నిజాయితీని మెచ్చిన మోపాల్ ఎస్సై మహేష్ అతన్ని అభినందించి హైదర్ చేతుల మీదుగానే బాధితులకు అప్పగించారు. దీంతో షేక్ హైదర్ నిజాయితీ పట్ల పలువురు అభినందించారు.

ఖర్చు ప్రజలది.. పెద్దరికం ప్రభుత్వానిదా..?

● మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-నవీపేట్



మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరిట అభివృద్ధి చేశామని బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దరికంగా ప్రజల ఖర్చుతో ప్రచారం చేస్తుందని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని అలీసాగర్ లిఫ్టు ఎత్తిపోతల పథకంలోని కోస్లీ, బాగేపల్లి, అలీసాగర్ స్టేజీలను పరిశీలించారు. అలాగే మండలంలోని అభంగపట్నం ఎర్రగుంట రిజర్వాయర్‌ను సైతం పరిశీలించి మీడియాతో మాట్లాడారు. బోధన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే షకీల్ రైతులకు ఉపయోగపడే ఏ ఒక్క పని చేయలేదని విమర్శించారు. వెయ్యి ఎకరాలకు రెండు తడులకు నీరు అందించే ఎర్రకుంట రిజర్వాయర్ మిగులు పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే షకీల్‌తో పాటు ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం రైతుల పట్ల వారికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. అసలు అభివృద్ధి చేయని వ్యక్తులు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని అందుకే తాను చేసిన అభివృద్ధిని చెప్పేందుకే పర్యటిస్తున్నానని అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగంతో పాటు విద్యా, వైద్య రంగాలకు సౌకర్యాలు కల్పించగా అస్తవ్యస్తంగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 50వేల వార్షిక బడ్జెట్‌తో చేసిన అభివృద్ధి రెండు లక్షల నలభై వేల కోట్ల వార్షిక బడ్జెట్‌తో ఎందుకు చేయలేకపోతున్నారో చెప్పాలని అన్నారు.

ప్రజలు సైతం ఎవరు ఏం చేస్తున్నారో అవగాహన పెంచుకోవాలని సూచించారు. మాయమాటలకు మోసపోకుండా ప్రజల కోసం వ్యవస్థ కోసం పనిచేసే వారినే గెలిపించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 9 నియోజకవర్గాలు గెలవడమే గాక రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, పార్టీ మండల అధ్యక్షులు సుధాకర్ రావు, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, మోస్రా సాయరెడ్డి, భగవాన్, బాబు, సంజీవ్ రెడ్డి, మూస, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మర్రిచెట్టు దేవస్థానం వార్షికోత్సవం

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం (శ్రీ శివలింగేశ్వర స్వామి)19వ వార్షికోత్సవం పురస్కరించుకుని శనివారం ఉదయం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపడుతున్నట్లు స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎర్రోళ్ల విజయ్ అన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సెక్రటరీ బద్దం అశోక్‌రెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను మార్గదర్శకాలకు లోబడి చేపట్టాలి

డీటీఎఫ్ నాయకుల డిమాండ్


నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను మార్గదర్శకాలకు లోబడి చేపట్టాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బాలయ్య, ప్రధాన కార్యదర్శి రాజన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టని కారణంగా కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిన కారణంగా అనేక పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో సమస్యలు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.

కంటి చూపుపై అశ్రద్ధ వద్దు

● అత్తాంగ్ టోల్‌ప్లాజా ప్రాజెక్టు మేనేజర్ విజయ్ కుమార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కంటి చూపుపై అశ్రద్ధ వహించవద్దని ఏదైనా తేడాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రులకు వెళ్లి కంటి పరీక్షలు చేయించుకోవాలని అత్తాంగ్ డిచ్‌పల్లి టోల్‌ప్లాజా ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ విజయకుమార్ అన్నారు. శనివారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని అత్తాంగ్ టోల్ వే ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా కంటి శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ విజయ్ కుమార్, మెయింటెనెన్స్ మేనేజర్ గౌరీ నాయుడు, రూట్ ఆపరేషన్ మేనేజర్ నీరజ్ దేశ్ పాండే, సీఓఏసీ వీరబాబు, టోల్‌ప్లాజా మేనేజర్ చలపతి రావు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసపత్రి వైద్యులు సంతోష్ కుమార్, వరలక్ష్మి, నవత, ఎస్ఐ నరేష్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, అధికారులు ప్రకాష్, లిఖిత, వెంకట్ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో అభివృద్ధి శూన్యం

నవతెలంగాణ-నందిపేట్



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి ఏబీ శ్రీనివాస్

గత పది సంవత్సరాలలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమని టీపీసీసీ అధికార ప్రతినిధి ఏబీ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఏం ఒరగబెట్టారని దశాబ్ది ఉత్సావాలు నిర్వహించారని మండిపడ్డారు. దళితులకు మూడెకరాల భూమి ఇచ్చినందుకా?, డబుల్ బెడ్ రూమ్‌ల ఇల్లు కట్టించినందుకా, లేదా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇచ్చినందుకా? దశాబ్ది ఉత్సావాలు చేపట్టారని ప్రశ్నించారు. అమరుల కుటుంబాలకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వకుండా వారికి ఎలాంటి ఆర్థికసాయం అందించకుండా అమరుల స్థూపం ఏర్పాటు చేయడం చాలా సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అభివృద్ధి పక్కన బెట్టి కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెడుతూ దళిత బంధు తన కార్యకర్తలకే కట్టబెడుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వస్తుందని బీఆర్ఎస్ పార్టీ అంతు చూస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ మంద మహిపాల్, నాయకులు పెంట ఇంద్రుడు, వై.ఎస్. గంగాధర్, భూమేష్‌రెడ్డి, దేవిదాస్ గౌడ్ పాల్గొన్నారు.

వీఆర్ఏల డివిజన్ అధ్యక్షునిగా చెలిమేల రాములు ఏకగ్రీవం

నవతెలంగాణ-ధర్పల్లి

వీఆర్ఏల డివిజన్ అధ్యక్షునిగా ధర్పల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ వీఆర్ఏ చెలిమేల రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన వీఆర్ఏ సంఘం సమావేశం అనంతరం ఎన్నికలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షునిగా దయాసాగర్, ప్రధాన కార్యదర్శిగా బియ్య సాయినాథ్, కోశాధికారిగా డిచ్‌పల్లి గంగాధర్, ఉపాధ్యక్షులుగా 1 సిలార్ మహమ్మద్, 2వ ఉపాధ్యక్షునిగా ఇందల్వాయి మండలం నుంచి ఒకరు, జాయింట్ సెక్రటరీగా సిరికొండ ప్రశాంత్, కార్యవర్గ సభ్యులుగా బోర్గం రాజేశ్వర్, రూరల్ మండలం నుంచి ఒక్కరు, ఏర్గం సాయిలు ముఖ్య సలహాదారులుగా, నవీపేట్ మండల అధ్యక్షులు పెంటయ్య, ధర్పల్లి మండల అధ్యక్షులు హరిచరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్కులు, వాటర్ బాటిల్స్ పంపిణీ

నవతెలంగాణ-మెండోరా

కరుణ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుస్సాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, నోటుబుక్కులు, వాటర్ బాటిల్స్ శనివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా శెట్ పల్లి గ్రామానికి చెందిన కరుణ ట్రస్ట్ అధ్యక్షుడు పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్కులు, వాటర్ బాటిల్స్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించిన పాఠాలు శ్రద్ధగా విని ఉన్నత చదువులు చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలను, పాఠశాల పేరును నిలబెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కరుణ ట్రస్ట్ అధ్యక్షులు మహేష్, ఉపాధ్యాయులు రమేష్, శారద, విజయలక్ష్మి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు రికవరీ చేయాలి

నవతెలంగాణ-ముప్కాల్



సమావేశంలో పాల్గొన్న పలువురు

ముప్కాల్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం జిల్లా మహిళా సమాఖ్య అధికారి దుండి జ్యోతి అధ్యక్షతన 'స్త్రీ' నిధి మండల స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్త్రీ నిధిలో డిజిటల్ డాక్యుమెంటేషన్ విధానం, ముప్కాల్ మండల సమాఖ్యను జిల్లాలోనే పైలట్‌గా ఎంపిక చేశారని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు. స్త్రీ నిధి సహాయంతో సోలార్, ఎలక్ట్రికల్ ఆటోస్, మహిళా సంఘం సభ్యులకు ఇతర జీవనోపాధి కోసం రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా బ్యాంక్ రుణాలు రూ.16.28 లక్షల లక్ష్యం వరకు ఉంటుందన్నారు. బ్యాంక్ రుణాలు వందశాతం రికవరీ చేయవలసిందిగా ఏపీఎంకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసాద్‌రావ్, ఎస్ఎస్ మేనేజర్ మురళి కృష్ణ, సీసీఎస్‌లు ప్రణీత, స్వరూప, అన్నపూర్ణ, 16 గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

పట్టణ కోర్టులో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న సివిల్ జడ్జి వేముల దీప్తి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ న్యాయస్థానం ఆవరణలో లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో భాగంగా సీనియర్ న్యాయమూర్తి నసీం సుల్తానా అధ్యక్షతన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి సమక్షంలో విద్యార్థులకు బ్యాగులను శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులకు చదువు గొప్పతనాన్ని వివరిస్తూ వారిని గొప్ప విజ్ఞానవంతులుగా చేయాలని న్యాయమూర్తులు ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సరసం చిన్నరెడ్డి (సరసం ట్రస్ట్), రోటరీ క్లబ్ లయన్స్ క్లబ్ అధ్యక్షుల ఆధ్వర్యంలో పట్టణంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్, జామెట్రీ బాక్స్, పెన్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నరేందర్, అవారి రమేష్, సీనియర్ న్యాయవాదులు భూపతిరెడ్డి, సదానంద, శ్రీధర్, జగన్, తుమ్మ సుకేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏషియన్ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు ఘన సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఈనెల 13 నుంచి 17వరకు తైవాన్ దేశంలో తైపిలో జరిగిన ఏషియన్ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలలో భారత జట్టు తరపున జిల్లా క్రీడాకారులు ఎస్.సౌమ్యరాణి (కెప్టెన్), జి సౌందర్య, జి.సాత్విక, జి.శ్రావిక, డి.సరియు (సుద్దపల్లి సాఫ్ట్ బాల్ రాష్ట్ర అకాడమీ క్రీడాకారులు) భారత జట్టు తరపున పాల్గొన్న సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గోదావరి క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోదావరి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. సుద్దపల్లి పాఠశాల క్రీడా మైదానంలో ఆడిన క్రీడాకారులు అంతర్జాతీయ పోటీలలో రాణించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరింత మంది క్రీడాకారులను భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే విధంగా, భారత జట్టు బలంగా ఉండేవిధంగా శిక్షణ కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగామోహన్, పాఠశాల సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ దీప్తివాని, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు నల్లూరి లత, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ వేముల మౌనిక, ఉపాధ్యాయులు సుకన్య, ఉమారాణి, సంజీవ, పద్మావతి, స్వర్ణలత క్రీడాకారులు పాల్గొన్నారు.

తండాలను అభివృద్ధి చేయడమే కేసీఆర్ ధ్యేయం

● ఎంపీపీ నల్ల సారిక హన్మంత్‌రెడ్డి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-ధర్పల్లి

రాష్ట్రంలోని అత్యధిక గిరిజన తండాలు అభివృద్ధిలో వెనకబడి ఉన్నాయని గ్రహించిన ముఖ్యమంత్రి కేసీఆర్ వాటిని అభివృద్ధి చేసేదిశగా అడుగులు వేస్తున్నారని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మోహిదిన్ సాబ్ తండాలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాండకు రవాణా సౌకర్యాలు, ఇతరత్రా వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్న గిరిపుత్రుల సమస్యలు మును పెన్నడూ ఏ ప్రభుత్వాలు చేపట్టలేదని.. కానీ నేడు కేసీఆర్ చేసి చూపిస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో తండాలు మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉందని గిరిపుత్రులు కేసీఆర్‌ను గుర్తుంచుకొని పార్టీకి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తండా సర్పంచ్ మంజుల నరేష్, ఉప సర్పంచ్ అన్వేషణ, ధర్పల్లి సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాలరాజ్, సొసైటీ చైర్మెన్ చెలిమేల మల్లికార్జున్, పోతారాజు, మాలవత్ బాలు, సురేష్, తండా పెద్దలు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేసిన నలంద పాఠశాల యాజమాన్యం

నవతెలంగాణ-ఆర్మూర్



మున్సి పాలిటీలోని మామిడిపల్లి నలంద హైస్కూల్ పూర్వ విద్యార్థికి గరిపల్లి అజయ్‌కు శనివారం ఆర్థిక సహాయం అందించినట్లు యాజమాన్యం తెలిపింది. గరిపల్లి అజయ్ నలంద పాఠశాలలో అభ్యసించే సమయంలో డివిజన్ పరిధిలో నిర్వహించిన అంతరపాఠశాలల క్రీడా పోటీల్లో అథ్లెటిక్ (పరుగు పందెం)లో అద్భుత ప్రతిభ కనబర్చాడు. అజయ్‌ది నిరుపేద కుటుంబం, అలాగే చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. క్రీడల్లో మంచి భవిష్యత్తు కనబరుస్తున్న అజయ్‌కు నలంద హైస్కూల్ యాజమాన్యం తన పరిస్థితిని అర్థం చేసుకొని సహృదయంతో అతనికి ఆర్థికంగా తోడ్పాటును అందించాలని నిర్ణయించారు. అదే సమయంలో ఇజ్రాయెల్ తెలంగాణ అసోసియేషన్ వారికి విషయాన్ని, నలంద పీఈటీ అంజద్ తెలియజేశారు. ఈ సందర్భంగా నలంద యాజమాన్యం, ఇజ్రాయెల్ తెలంగాణా అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సోమ రవి, మాజీ కార్యనిర్వాహణాధికారి బొమ్మకంటి మహేష్ గౌడ్, సభ్యులు ఉత్తూరు వినోద్, అంజద్ సమక్షంలో రూ.75,500, నలంద హైస్కూల్ యాజమాన్యం రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా అజయ్ నలంద హైస్కూల్ యాజమాన్యానికి, పీఈటీ అంజాద్, ఇజ్రాయెల్ తెలంగాణా అసోసియేషన్ సిబ్బందికి రుణపడి ఉంటానని తెలియజేశాడు. కార్యక్రమంలో నలంద హై స్కూల్ యాజమాన్యం కరెస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపాల్ సాగర్, ఇజ్రాయెల్ తెలంగాణా అసోసియేషన్ సభ్యులు వినోద్, పీఈటీ అంజాద్, నలంద ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ చైర్మన్‌కు పరామర్శ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి సింగిల్ విండో మాజీ చైర్మన్ విట్టల్ రావు అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న స్థానిక సింగల్ విండో చైర్మన్ గంగాధర్ బిఆర్ఎస్ నాయకులు గైని రమేష్ యాచారం గ్రామానికి చెందిన రమేష్ నాయక్ భూంపల్లి గ్రామ మాజీ అధ్యక్షుడు రాజేందర్‌తో కలిసి వారుమర్శించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో వైద్యం పొంది ఇంటికి రావడం తో వారి గ్రామానికి వెళ్లి పరామర్శించి వారి కుమారులతో మాట్లాడారు.



పరామర్శిస్తున్న నాయకులు

పాడి కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలి

ఎల్లారెడ్డి ముదిరాజ్ సంఘ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆరెస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిని బర్తరఫ్ చేయాలని ఎల్లారెడ్డి ముదిరాజ్ సంఘ సభ్యులు శనివారం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ముదిరజ్ సంఘ సభ్యులు మాట్లాడుతూ ముదిరాజ్ జర్నలిస్ట్ అయిన అజయ్ ని తీవ్రంగా కొట్టి ముదిరాజ్‌లను కించ పరిచిన ఎమ్మెల్సీని పాడి కౌశిక్ రెడ్డి ని వెంటనే భర్తరఫ్ చేయాలనీ ముదిరాజ్ జాతికి క్షమాపణ చెప్పలని లేని యెడల ఇక ముందు తీవ్ర ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బైండ్ల పోచన్న, మర్రి బాలకిషన్, రమేష్, సంగమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఆర్థిక పురోగాభివృద్ధి

- కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాల



కరపత్రాలు అందజేస్తున్న కేంద్ర మంత్రి

నవతెలంగాణ-దోమకొండ

దేశంలో ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రధాని మోడీ కృషి చేస్తున్నారని కేంద్ర పశు, సంవర్ధక శాఖ మంత్రి పరుషోత్తం రూపాల అన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో పూజలు చేసి పలు వార్డ్ లలో శనివారం ప్రధాని నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వం తొమ్మిది ఏళ్లలో సాధించిన విజయాలను మహాజన్ సంపర్క అభియాన్‌లో భాగంగా ప్రజలకు కరపత్రాలు అందజేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత దేశం ఆర్థికంగా పురోగతి సాధించి బలోపేతం అయిందని, ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అరుణ తార, కామరెడ్డి అసెంబ్లీ ఇంచార్జ్ కాటేపల్లి వెంకట రమణారెడ్డి ,అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జయశ్రీ ,మండల అధ్యక్షులు చింతల రాజేష్ ,ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి ,పట్టణ అధ్యక్షులు భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తాం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/లింగంపేట్



ఇంటింటా ప్రచారం

ఎల్లారెడ్డి నియోజక వర్గంలో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని మదన్ మోహన్ తెలిపారు. ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్, జనకంపల్లి ఖుర్దు, కొట్టాల్ గ్రామాలలో శనివారం పల్లెపల్లెకు కాంగ్రెస్.. గడప గడపకు మదన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గడప గడపకు తిరుగుతు ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నరు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజలు కోసం అమలు పరిచే సంక్షేమ పథకాల వివరాలను వివరించారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

లింగంపేట్ : లింగంపేట్ మండలం రాంపూర్ గ్రామంలో పలువురు శనివారం మదన్ మోహన్ అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ బుర్ర నారా గౌడ్ తెలిపారు. ఆయన వెంట సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ నారా గౌడ్, రవి, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరేడ్‌తో క్రమశిక్షణ

నవతెలంగాణ-గాంధారి



పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

పరేడ్‌తో క్రమశిక్షణ శారీరక ధృఢత్వం, మానసిక ఉల్లాసం ఉంటుందని గాంధారి ఎస్సై డి.సుధాకర్ అన్నారు. పోలీస్ శాఖలో నిర్వహించే వీక్లీ పరెడ్ లో భాగంగా శనివారం ఉదయం గాంధారి పోలీస్ స్టేషన్ ఆవరణలో వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీక్లీపరేడ్‌లో పాల్గొన్న సిబ్బందిని ఉద్దేశించి ఎస్.ఐ సుధాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిరంతరం వీక్లీ పరేడ్ కు హాజరుకావాలని తద్వారా క్రమశిక్షణ పెరగడంతో పాటు పోలీస్ శాఖలో నిత్యంజరుగుతున్న విషయాలని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. పోలీసులకు క్రమశిక్షణ పరేడ్ తోనే సాధ్యమవుతుందని ఈక్రమశిక్షణ మూలంగానే సమాజంలో పోలీసులకు ప్రత్యేక గౌరవం, గుర్తింపు ఉంటుందని అన్నారు. పరేడ్‌లో హెడ్ కానిస్టేబుల్ రవికుమార్, కానిస్టేబుళ్ల కిషన్, స్వప్న, బాలాజీ, బానుచందర్, నవీన్, హెూంగార్డు విఠల్, లు పాల్గొన్నారు.

వీఏవో బాబాగౌడ్ ఇంటి ముట్టడి

- డబ్బులు చెల్లించే వరకు ఆందోళన చేస్తామని స్పష్టీకరణ
- అధికారులు బాబా గౌడ్ తో కుమ్మక్కు అయ్యారని ఆరోపణ

నవతెలంగాణ-తాడ్వాయి

మహిళా సంఘాల డబ్బులు స్వాహా చేసిన విఏఓ బాబా గౌడ్ ఇంటిముందు శనివారం మహిళలు ఆందోళన చేపట్టారు. తాడ్వాయి మండలం నందివాడ గ్రామంలోని బాబాగౌడ్ ఇంటిముందు ఉదయం నుంచి రాత్రి వరకు ఆందోళన కొనసాగించారు. బాబా గౌడ్‌ను వెంటనే అధికారులు రప్పించాలని, స్వాహా చేసిన డబ్బులను రికవరీ చేయించాలని మహిళలు డిమాండ్ చేశారు. బాబా గౌడ్‌తో సదరు అధికారులు కుమ్మక్కయ్యారని మహిళా సభ్యులు ఆరోపించారు. అధికారులు బాబా గౌడ్ తో కుమ్మక్కు కావడంతోనే రికవరీ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. తాము ఉదయం నుంచి రాత్రి వరకు ఆందోళన నిర్వహించిన అధికారులు పట్టించుకోరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.





వీఏవో బాబాగౌడ్ ఇంటి ఎదుట బైటాయించి వంట చేస్తున్న మహిళలు.. రాత్రి సైతం అక్కడే బైటాయించిన మహిళలు

బాబా గౌడ్ నుంచి డబ్బులు రికవరీ అవుతేనే తాము ఆందోళన విరమిస్తామని మహిళలు భీష్మించుకు కూర్చున్నారు. డబ్బులు రికవరీ చేయించాలని తాము కామారెడ్డి లోని కలెక్టర్ కార్యాలయానికి తరలి వెళ్లామని తెలిపారు. కలెక్టర్ పిడి సాయన్నను పిలిపించి వెంటనే డబ్బుల రికవరికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు. కానీ పిడి సాయన్న రికవరీ విషయంలో తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రూపాయి రూపాయి జమచేసి సంఘంలో దాచుకుంటే విఏవో బాబా గౌడ్ గద్దలాగా తన్నుకుపోయాడని మహిళలు మండిపడ్డారు. తాము ఉదయం నుంచి రాత్రి వరకు ఆందోళన చేసిన ఒక్క అధికారి స్పందించరా అంటూ అసహనం వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకోకుంటే తమ ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయని హెచ్చరిం చారు. బాబా గౌడ్‌తో బాండు రాయించడానికి శుక్రవారం పిడి సాయన్న గ్రామానికి వస్తే బాబా గౌడ్ అందుబాటులో లేకుండా పోయాడని మహిళలు వాపోయారు. బాబా గౌడ్ ను అందుబాటులోకి తీసుకువచ్చే అధికారం అధికారులకు లేదా అని ప్రశ్నించారు. మహిళల డబ్బులను పట్టపగలే దోచుకున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు బాబాగోడ్‌తో మీలాకత్ కావడంతోనే ఏమాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. మహిళలు బాబా గౌడ్ ఇంటివద్దె వంటా వార్పు చేసుకుని భోజనం చేశారు.

అధికారులు స్పందించకుంటే సీఎం వద్దకు వెళ్తాం

డబ్బులు రికవరీ విషయంలో అధికారులు స్పందించకుంటే తాము ఆదివారం సీఎం కేసీఆర్ వద్దకే వెళ్తామని మహిళలు తెలిపారు. లక్షల రూపాయలు స్వాహా అయితే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మహిళా సంఘాలలో ప్రతి రూపాయి సక్రమంగా వినియోగించడం కోసం సీసీలు, ఏపీఎంలు, పీడీలు ఉన్నారని అయిన ఒక్కరు పుస్తకాలు చూడకుండా సంతకాలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. అమాయకులైన మహిళలను మోసం చేశారని స్పష్టంగా తేలిన అధికారుల నాన్చుడు ధోరణి ఏమిటని వారు వాపోతున్నారు ఆదివారం ఉదయం వరకైనా మాకు స్పష్టమైన హామీ దొరక్కపోతే తాము నేరుగా సీఎం కే తమ బాధను చెప్పుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు ప్రతినిధులు పాల్గొన్నారు

పోడుభూములకు పట్టాలు
సీపీఐ(ఎం) పోరాట ఫలితమే

- పార్టీ ఎల్లారెడ్డి ఏరియా కార్యదర్శి మోతీరాం నాయక్

నవతెలంగాణ-గాంధారి

సీపీఐ(ఎం) పోరాటాలతోనే పోడు భూములకు పట్టాలు సాధించుకున్నామని ఆ పార్టీ ఎల్లారెడ్డి ఏరియా కార్యదర్శి మోతీరాం నాయక్ అన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భూ పోరాటం సందర్శించడం కోసం చేపట్టిన బస్సు యాత్ర.. పద్మాజివాడి ఎక్స్ రోడ్డుకు శనివారం చేరుకోగా.. యాత్రకు స్వాగతం పలకడం కోసం గాంధారి ప్రజాసంఘాల కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి పద్మజివాడి రోడ్డుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మోతీరాం నాయక్ మాట్లాడుతూ ప్రజా సంఘాలు పోరాటం వల్లే ఈరోజు పోడుభూములకు పట్టాలు సాధించుకున్నామని అన్నారు. ప్రతి ఫలితాల వెనుక పోరాటం ఉంటుందని పోరాటం చేయటం వల్లే ఫలితాలు వస్తాయని అన్నారు. రాబోయే కాలంలో అసైన్డ్ భూమి పట్టా సాధించు కోవడం కోసం ఇండ్ల స్థలాలు సాధించు కోవడం కోసం ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. గిరిజనులకు పోడు పట్టలు పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కమ్మరి సాయిలు, సిఐటియు నాయకులు ప్రకాష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాములు, ఐద్వా నాయకులు శ్రీలత, రోజా, మధ్యాహ్న భోజన సంఘం నాయకులు శ్రావణ్, రైతు సంఘం నాయకులు గేమిసింగ్, సంగం సాయిలు, రైతు సంఘం నాయకులు సాయిలు, భూ పోరాటం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

బానాపూర్ మీదుగా గాంధారికి బస్సు నడపాలి

- డీఎంకు సర్పంచ్‌ల వినతి

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండల కేంద్రం నుండి మేంగారం బోనాలు బానాపూర్ మీదుగా గాంధారికి బస్సు నడపాలని శనివారం ఆయా గ్రామాల సర్పంచులు కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశంకు వినతి పత్రం అందజేశారు. పాఠశాలలు, కళాశాలలో విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు మండల కేంద్రాలకు వెళ్లాలంటే ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపారు. అంతే కాకుండా రైతులు భవన నిర్మాణ కార్మికులు మహిళా సంఘాలు మండల కేంద్రానికి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఎరువులు విత్తనాల కోసం రైతులు మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందని అన్నారు. కావున ఆయా గ్రామాల మీదుగా బస్సు సర్వీస్‌ను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్ రెడ్డి, సర్పంచులు బాలయ్య, కవిత నరసింహులు, సాయి గౌడ్, లత పీర్ సింగ్, మంజుల నర్సిం, ఆయా గ్రామాల సర్పంచులు ఉన్నారు.



డీపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



పనులు ప్రారంభిస్తున్న చైర్మన్

ఎల్లారెడ్డి పట్టణంలోని వీరశైవ లింగాయత్ జంగం సమాజం కమ్యూనిటీ హాల్ భవనం కోసం శనివారం మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ నీలకంఠేశ్వర ఆలయం పక్కన భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 10 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న భవనాన్ని తొందరగా నిర్మాణం చేపట్టుకోవాలని వారికి ఆయన సూచించారు. స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఈ కమ్యూనిటీ హాల్ 10 లక్షల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ నీలకంఠం, మున్సిపల్ ఏఈ వినోద్, బిఆర్ఎస్ అధికార ప్రతినిధి రామప్ప, వీరశైవ లింగాయత్ అధ్యక్షులు ముత్తి వీరప్ప, ఆలయ పూజారి సంగప్ప, నాయకులు కపిల్ బసప్ప, ఈశ్వరప్ప, హనుమంతప్ప, మట్టం శంకరప్ప గాలప్ప తదితరి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-సదాశివనగర్



విద్యార్థులకు పుస్తకాలు అందజేత

మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో సురుకంటి కృష్టారెడ్డి దంపతులు కృష్టారెడ్డి తల్లి జ్ఞాపకార్థం పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సొసైటీ చైర్మన్ మర్రి సదాశివరెడ్డి మాట్లాడుతూ తల్లిగారి జ్ఞాపకార్థం విద్యార్థులకు పుస్తకాలు పంచడం అభినందనీయమని ఈ విధంగా సేవా కార్యక్రమాలు చేయడం వల్ల పలువురు ఆదర్శంగా తీసుకొని తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పేదలకు సహాయ సహకారాలు చేసే స్ఫూర్తిని కృష్టారెడ్డి దంపతులు నిలిపారని అన్నారు. సీనియర్ నాయకులు పైడి జనార్ధన్ మాట్లాడుతూ కృష్టారెడ్డి విద్యార్థి పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని ఇలాంటి సేవా కార్యక్రమాలు ముమ్ముందు చేయాలని వారు కృష్టారెడ్డి దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యుడు నబి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు ఎడ్ల నర్సింలు, సొసైటీ డైరెక్టర్ బక్కన్న గారి భాస్కర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాధక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన ఇద్దరిపై కేసు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఇద్దరువ్యక్తుల పై కేసు నమోదు చేసినట్టు గాంధారి ఎస్ఐ సుధాకర్ తెలిపారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ తీగలు తెగి ఆవు, గేదె మృత్యువాత

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ధర్మారావుపేట్ గ్రామంలో విద్యుత్ తీగలు తెగిపడటంతో జమాల్‌పూర్ మధుకర్ రావుకు చెందిన జెర్సి ఆవు ,గేదె తో పాటు రెండు పెంపుడు కుక్కలు మృత్యువాత పడ్డాయి. వీటి మృతితో సుమారు రెండు లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు.

కష్టపడ్డ కార్యకర్తలకు కాంగ్రెస్‌లో గుర్తింపు

నవతెలంగాణ-మద్నూర్



సమవేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పట్టుకొమ్మలని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పట్టుదలతో కృషి చేద్దామని, కష్టపడ్డ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉంటుందని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గజ్జు పటేల్ యువ నాయకులు అరవింద్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జుక్కల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ రివ్వు మీటింగ్ మద్నూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ భవనంలో శనివారం నిర్వహించారు. ఏడు మండలాల నుండి ఆయా మండలాల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో మద్నూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు భగవాన్, మండల పార్టీ అధ్యక్షులు వట్నాల రమేష్, సీనియర్ నాయకులు గంపల గంగాధర్, ఆయా మండలాల నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపించాలి..
లేకుంటే ముక్కు నేలకు రాయాలి

- అభివృద్ధి కోసం కష్టపడుతుంటే నిరాధార ఆరోపణలా..?
- బాల్కొండ అభివృద్ధిని ఎవరు ఆపలేరు
- గంజాయి అమ్ముతున్నారని అడ్డగోలుగా మాట్లాడుతున్నారు
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ధ్వజం

నవతెలంగాణ-బాల్కొండ(కమ్మర్‌పల్లి)/భీంగల్

తాను అభివృద్ధి కోసం తాపత్రయ పడుతుంటే బీజేపీ,కాంగ్రెస్ నేతలు కమిషన్లు తింటున్నానని అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. అభివృద్ధి కోసం కష్టపడుతున్న నన్ను కమిషన్లు తిన్నావని నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, తన తమ్ముడు గంజాయి అమ్ముతున్నరని అడ్డగోలుగా మాట్లాడుతున్నారని గంజాయి అమ్మాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు?. ఈ మాటలు వింటుంటే ఒక్కోసారి బాధ అనిపిస్తుందని తన ఆవేదన వ్యక్తంచేశారు. ఆరోపణలు నిరూపించాలని, లేకుంటే ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలని సవాలు విసిరారు. తాను ఉండగా బాల్కొండ అభివృద్ధిని ఎవరు ఆపలేరని స్పష్టంచేశారు. శనివారం బాల్కొండ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. బాల్కొండ మండల కేంద్రంలో 50 లక్షల వ్యయంతో నిర్మించిన కళ్యాణ మండపం ప్రారంభోత్సవం చేశారు. నూతనంగా నిర్మించిన కేజీబీవి స్కూల్ ప్రారంభోత్సవం(వన్నెల్ రోడ్), కిసాన్ నగర్ గ్రామంలో బాల్కొండ నుండి ముప్కాల్ వరకు రూ. 1.3కోట్ల వ్యయంతో బి.టి రోడ్ పునరుద్ధరణ, నాగాపూర్ నుండి గోదావరి రివర్ వరకు రూ.1.15 కోట్ల వ్యయంతో బిటి రోడ్ పునరుద్ధరణకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ తాను ఉండగా బాల్కొండ అభివృద్ధిని ఎవరు ఆపలేరని, ఎవరు అడ్డు వచ్చిన అబివృద్ధి ఆగే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రి కేసిఆర్ సహకారంతో రూ.114 కోట్లతో బాల్కొండ గ్రామం అన్ని విధాల అభివృద్ధి చేసుకున్నామని గణాంకాలతో సహా మంత్రి వివరించారు.

బాల్కొండ నియోజకవర్గంలోనే అత్యధికంగా గంజాయి కేసులు అయ్యాయని తాను అదిలాబాద్ ఎస్పీ, జిల్లా పోలీసు వాళ్ళను పలుమార్లు ఆదేశిస్తే, కఠినంగా వ్యవహరిస్తే గంజాయి వాడకం తగ్గిందని చెప్పారు. గంజాయి నిర్మూలన కోసం తాను పనిచేస్తే మేమే అమ్ముతున్నమని నిరాధార ఆరోపణలు చేస్తూ మా కుటుంబాన్ని బద్నాం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఉన్న ఏకైక క్రషర్‌లో రూ.400 కోట్లు సంపాదించారని ఆరోపణ చేస్తున్నారని, తాను తన బంధువులకు చెప్పి 10 కోట్లకే ఆ క్రషర్ ఇప్పిస్తానని.. ఆరోపణలు నిరూపించాలని సవాల్ చేశారు. 'వందల కోట్ల కాంట్రాక్టులు కమీషన్లు అని మాట్లాడుతున్నారు నియోజవర్గంలో 300 నుంచి 400 కోట్ల పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నాయని, అందులో 100 నుంచి 150 కోట్లు బీజేపీ నేతలు చెప్పిన వారికే ఇస్తానని కాంట్రాక్టుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టులు అన్ని మీకే అప్పజెప్తా దమ్ముంటే వచ్చి చేయండని సవాల్ విసిరారు. అన్ని బట్ట కాల్చి మీద వేసే మాటలే..ఏ ఒక్కదానికి ఆధారం లేదని అన్నారు. నా మీద ఆరోపణలను వారంలో నిరూపించాలని లేకుంటే ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు.

ప్రజలు కూడా అభివృద్ధి చేసే వారు ఎవరో...రెచ్చగొట్టే వారెవరో దయచేసి గమనించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ మాయ మాటలు నమ్మితే గోస పడతామని వివరించారు. బీజేపీ, నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్, ఉప్పు, పప్పు, నిత్యావసరాల ధరలు పెంచి సామాన్యులను గోస పెడుతున్నారని గుర్తు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భీంగల్ : భీంగల్ మండలంలోని పిప్రి, ముచ్కూర్ గ్రామాలలో పలు అబివృద్ధి పనులకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం శంకుస్థాపనలు చేశారు. పిప్రి నుండి ముచ్కూర్ వరకు 5 కోట్లతో నిర్మించే డబుల్ రోడ్డు పనులకు, పిప్రి నుండి లొద్ది రామన్న ఆలయం వరకు 3.20 కోట్లతో నిర్మాణ పనులకు, అలాగే ఆలయం వద్ద 75 లక్షలతో నిర్మించే కల్వర్టు పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. పిప్రి గ్రామంలో అహ్లాదకరమైన వాతవరణంలో శంకుస్థాపనలు చేయడం ఆనందంగా ఉందని మంత్రి ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి, యంపిపి ఆర్మూర్ మహేష్, పిప్రి సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, యంపిటీసి అరిగెల సరితదాస్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య మరియు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



బాల్కొండలో శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేముల



భీంగల్ : పిప్రిలో రోడ్డు పనులకు శంకుస్థాపన

ఈగ గంగారెడ్డి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్‌లోని బోర్గంలో బీఆర్ఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు ఈగ గంగారెడ్డి తల్లి ఈగ గంగవ్వ 8రోజుల క్రితం మరణించడంతో వారి కుటుంబ సభ్యులను టీఎస్ డబ్ల్యూ సీడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలిత రాఘవేందర్, వారితో పాటు మాజీ మేయర్ ఆకుల సుజాత, బంటు నిర్మల, ఆకుల కవిత పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వినాయక్‌నగర్‌లో సుదం రవి చందర్ అమ్మ సుదం మల్లమ్మ 5 రోజుల క్రితం మరణించడంతో వారి కుటుంబ సభ్యులు సుదం లక్ష్మి రవి చందర్‌ను టీఎస్ డబ్ల్యూ సీడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలిత రాఘవేందర్ రవిచందర్ కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యర్థులకు సివిల్ సర్వీసుల మెయిన్స్ కోచింగ్ ఏర్పాటు

నవతెలంగాణ-కంఠేశ్వర్

టీఎస్ఎస్‌సీ స్టడీ సర్కిల్, హైదరాబాద్ 28-05-2023న నిర్వహించిన యూపీఎస్సీ సీఎస్‌పీటీ-2023 పరీక్షలో అర్హత పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీతో సహా అభ్యర్థులకు సివిల్ సర్వీసుల మెయిన్స్‌కు కోచింగ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.శశికళ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం సంవత్సరానికి రూ.3లక్షల కంటే తక్కువగల అభ్యర్థులు 30-06-2023న లేదా ఆలోగా దిగువ డాక్యుమెంట్లతో పాటు డైరెక్టర్, టీఎస్ఎస్‌సీ స్టడీ సర్కిల్, బంజారాహిల్స్, హైదరాబాద్‌ను స్వయంగా సంప్రదించవలసిందిగా ఆదేశించినట్టు తెలిపారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు మెతుకు శివకుమార్
- పలుచోట్ల నిరసన

నవతెలంగాణ-విలేకరుల బృందం

కంఠేశ్వర్ : ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు మెతుకు శివకుమార్ అన్నారు. ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి అసభ్య పదజాలంతో కించపరిచినందుకు నగరంలోని వినాయక్ నగర్ ప్రాంతంలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు మెతుకు శివకుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముదిరాజులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని లేనియెడల ముదిరాజులు అందరం కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షులు అల్లూరి సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బులు, కోశాధికారి పిప్పెర రంజిత్, కార్యదర్శి సురేష్, కార్యవర్గ సభ్యులు సందీప్, జిల్లా కార్యదర్శి పిట్టల భూమయ్య, యూత్ జిల్లా ఇంచార్జి మొగిలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



కంఠేశ్వర్ : నిరసన వ్యక్తం చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు



డిచ్‌పల్లి : పోలీసులకు వినతి అందజేత

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం..

జక్రాన్‌పల్లి : మండల కేంద్రంలో ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిపై లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘ నాయకులు మాట్లాడుతూ బాధ్యత గల పదవిలో ఉంటూ ఒక వీడియో జర్నలిస్టును కిడ్నాప్ చేసి అతని హింసించడం కులాన్ని అవమానపరిచే విధంగా మాట్లాడడం సబబు కాదని అన్నారు. ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని ముదిరాజులు వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అధికార మదంతో కన్ను మిన్ను కానకుండా సామాన్య ప్రజలను బాధ్యత గల జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. ఇంత పనికిమాలిన వ్యక్తిని ఎమ్మెల్సీ పదవిలో కొనసాగించడం ఎంత మాత్రం సబబు కాదని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ముదిరాజ్ సంఘం తరఫున విజ్ఞప్తి చేస్తున్నట్టు చెప్పారు. వెంటనే అతన్ని పదవి నుండి తొలగించాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీని ముఖ్యమంత్రిని బాధ్యుడిని చేసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ యువసేన రాష్ట్ర కార్యదర్శి కొప్పు రాజేందర్, ముదిరాజ్ మహాసభ జిల్లా యువత ప్రధాన కార్యదర్శి జక్కం కార్తీక్, సొప్పరి వినోద్, కొప్పు ప్రసాద్, శివ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేసి, ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని, ముదిరాజ్‌లకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇందల్‌వాయి పోలీస్‌స్టేషన్‌లో ముదిరాజ్ మండల అధ్యక్షులు మోచ్చె గోపాల్ ఆధ్వర్యంలో ఎస్ఐ నరేష్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద రహదారిపై ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజులను ఇష్టం వచ్చిన విధంగా బూతు మాటలు తిట్టినందుకు ముదిరాజ్ జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మండల నాయకులు ఎర్రసాయిలు, ఎస్.గంగారం, దామా నర్సయ్య, సహేందర్, బి.నర్సయ్య రమేష్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

గోదావరి నదిలో చేపల వేట నిషేధం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ, దిగువ గోదావరి నదిలో చేపల వేట నిషేధిస్తున్నట్టు జిల్లా మత్స్యకార అధికారి రాజనర్సయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యకారులకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ, దిగువ నది జలాల్లో జూలై 01 నుంచి ఆగస్టు 31 వరకు చేపల వేట నిషేధిస్తున్నట్టు పేర్కొన్నారు. జులై, ఆగస్టులో వర్షాలకు, గోదావరి నదిలో నీటి ప్రవాహం అధికమై జలాశయంలో వుండే వివిధ రకాల చేపలు సహజంగా ప్రేరణ చెంది కోట్ల సంఖ్యలో సంతానం (బ్రీడింగ్) కోసం చేయడం వలన, జలాశయంలో చేపల ఉత్పత్తి పెరుగుతుందని తద్వారా చేపల వేటపై ఆధారపడి జీవించే మత్స్యకారులకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. జూలై, ఆగస్టు నెలల్లో మత్స్యకారులు ఆదేశాలు పాటించని మత్స్యకారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పద్మశాలి సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హసకొత్తూర్ గ్రామంలో పద్మశాలి సంఘం భవన నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. స్థానిక పద్మశాలి సంఘం సభ్యులు సమావేశాన్ని నిర్వహించుకోవడానికి సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి విన్నవించుకున్నారు. స్పందించిన మంత్రి కొద్దిరోజుల క్రితం పద్మశాలి సంఘం భవనానికి రూ.4లక్షల నిధులు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ కాపీని కూడా అందజేశారు. అందులో భాగంగా సంఘం భవనానికి శనివారం స్థానిక బీఆర్ఎస్ నాయకుల సమక్షంలో ముగ్గు పోసే కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సహకరించిన మంత్రి ప్రశాంత్‌రెడ్డికి పద్మశాలి సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, రైతుబంధు సమితి గ్రామ కోఆర్డినేటర్ నోముల నరేందర్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు తెడ్డు కిరీటి, నాయకులు మోహన్ నాయక్, సంఘం కార్యవర్గ సభ్యులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఎల్ఎస్ఓ) జిల్లా కార్యదర్శి సాయికృష్ణ అన్నారు. శనివారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేటు పాఠశాలలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న, అనుమతులు లేనటువంటి ప్రైవేట్ పాఠశాలలుపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా స్కూల్లోనూ పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని, ఫీజు నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జీవన్, జిల్లా కమిటీ సభ్యులు బాలాజీ నాయక్, వినోద్ నాయక్, సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది పనితీరు బాగుంది

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్ల పనితీరు పట్ల ఎడపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటి వెలుగు ఇన్చార్జి వైద్యాధికారి రాజ్ కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. బోధన్ మండలం పెగాడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రికి సంబంధించిన పలు రికార్డులను ఆయన పరిశీలించారు. రోజువారీగా ఓపి ఎంతమంది వస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సుమారు 150 నుంచి 200 మంది వరకు ఓపీ నమోదవుతున్నట్లు సూపర్వైజర్ శ్రీనివాస్ తెలిపారు.

'నో బ్యాగ్ డేస్'లో తడపాకల్ విద్యార్థులు



నో బ్యాగ్ డేలో విద్యార్థులు

నవతెలంగాణ-ఏర్గట్ల

తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ చేపట్టిన "నో బ్యాగ్ డేస్" కార్యక్రమంలో భాగంగా తడపాకల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శనివారం గోదావరి నది, మునుల గుట్ట ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం అక్కడి విశేషాలను తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ ద్వారా విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు మాట్లాడుతూ.. నో బ్యాగ్ డేస్‌లో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ ప్రతి నెలలో నాల్గోవ శనివారం విద్యార్థులకు పాఠాలు బోధించకుండా గ్రామాల్లో గల వివిధ ప్రదేశాలను సందర్శించాలని, ముఖ్య విషయాలను గురించి చర్చించాలని, మానసిక నైపుణ్యం, జ్ఞాన సంపద కోసం ఆటలు, వివిధ కార్యక్రమాలను చేయించాలని పిలుపునివ్వడంతో తడపాకల్ గోదావరి నది, మునుల గుట్టను సందర్శించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు నరేందర్, కృష్ణ ప్రసాద్, నాగప్ప, శంకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డివిజన్‌లో ఉచిత వైద్య శిబిరాలు

నవతెలంగాణ-ఆర్మూర్

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్రం ఆదేశానుసారం నేడు డివిజన్‌లోని వివిధ గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్టు ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ భాను రామగిరి, డాక్టర్ రాకేష్ శనివారం తెలిపారు. డివిజన్‌లోని ఆలూర్ మండల కేంద్రంలోనూ అంకాపూర్, పిప్రి, వేల్పూర్ మండలంలోని అక్లూర్, పడగల్, భీంగల్ మండలంలోని బడా భీంగల్‌లలో ప్రముఖ ఆసుపత్రిలకు సంబంధించిన వైద్యులు ఉచితంగా వైద్య సేవలు అందజేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో వెల్ కం పార్టీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ శివారు గాంధీనగర్‌లో గల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో శనివారం వెల్‌కం పార్టీ నిర్వహించినారు. ఈ సందర్భంగా పాఠశాల పాలనాధికారి పద్మ మాట్లాడుతూ.. నూతన విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పాఠశాల పునాది లాంటిదని, విద్యార్థులు నేటి పోటీ ప్రపంచంలో రాణించేందుకు పాఠశాల స్థాయి నుంచి అన్ని పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి వారికోసం క్రింది తరగతుల నుంచే ఐఐటీ, జేఈఈ, నీట్ లాంటి కోర్సులపైన సరైన అవగాహన కల్పించి శిక్షణ ఇస్తామని తెలిపారు. పూర్వ విద్యార్థులు, నూతన విద్యార్థులకు మార్గదర్శకులుగా కలిసి మెలగాలని తెలిపారు. నూతన విద్యార్థులు పూర్వ విద్యార్థులు కలిసి నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

రేపు కామ్రేడ్ డీవీకే కృష్ణ ప్రథమ వర్ధంతి

- జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 26న హైదరాబాద్‌లో కామ్రేడ్ డీవీ కృష్ణ ప్రథమ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు. ఆదర్శ కమ్యూనిస్టు, ప్రజాపంథా మార్గ నిర్దేశకుడు, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ డీవీ కృష్ణ ప్రథమ వర్ధంతి సభ పోస్టర్లను పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. కామ్రేడ్ డీవీ కృష్ణ ప్రథమ వర్ధంతి సభ ఈనెల 26న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఈ సందర్భంగా "కార్మికోద్యమం-కుల నిర్మూలన పోరాటం-కామ్రేడ్ డీవీకే కృషి, మతోన్మాద ఫాసిజం - కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి, డీవీకే సైద్ధాంతిక రాజకీయ నిర్మాణ కృషి" అంశాలపై స్మారకోపన్యాసాలు ఉంటాయన్నారు. ప్రముఖ కవి సంపాదకులు సతీష్ చందర్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పోటు రంగారావు, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తదితరులు ఉపన్యసిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కేజీ రామచందర్ అధ్యక్షత వహిస్తారన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సంధ్యారాణి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేశ్, నాయకులు మోహన్, రాజేందర్, గంగాధర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలి

నవతెలంగాణ-బోధన్

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కొరకు క్లస్టర్‌కు ముగ్గురు చొప్పున 18 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి 40 వేల చొప్పున రుణాలను మంజూరు చేయాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పద్మావతి, ఐకేపీ ఏపీఎం వినోద్ అన్నారు. శనివారం బోధన్ ఐకేపీ కార్యాలయంలో జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామ సంఘాల జనరల్ బాడీ సమావేశాలు జూలై 31 తేదీ వరకు పూర్తి చేయాలని, ఫుడ్ ప్రాసెసింగ్ కింద క్లస్టర్‌కు ముగ్గురు చొప్పున 18 మంది లబ్ధిదారులను గుర్తించి వారికి 40,000 రూ.ల చొప్పున ఋణాలు మంజూరి చేయాలని సూచించారు. అదే విధంగా బ్యాంక్ లింకేజ్ 2023-24 సంవత్సరానికి గానూ 577 సంఘాలకు రూ.3064.35లక్షలు వచ్చాయని తెలిపారు. ఇప్పటి వరకు 79 సంఘాలకు రూ.311.02 అందించి ప్రగతి సాధించినట్లు తెలిపారు. పీఎంఎఫ్ఎంఈ కింద 9 మందిని గుర్తించి స్వయం ఉపాధికి సిద్ధం చేసినట్టు వివరించారు. అందులో పప్పుల మిషన్‌లు, టేకరీ, స్నాక్స్ తయారీ యూనిట్ల కోసం లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. అలాగే 32 మంది న్యూ ఎంటర్‌ప్రైజెస్ లబ్ధిదారులను గుర్తించి బ్యాంక్ రుణాలు ఇప్పించామని పేర్కొన్నారు. మండల సమాఖ్య నుంచి సీఐఎఫ్ ద్వారా కొప్పర్తి క్యాంప్ గ్రామ సంఘానికి 4లక్షలు, పెంటాఖుర్దు క్యాంప్ గ్రామ సంఘానికి 2.50లక్షలు మంజూరి చేసినట్టు తెలిపారు. మహిళ సంఘాలకు ప్రభుత్వం నుంచి 716 సంఘాలకు 2,85,21,959 రూపాయలు వడ్డీలేని రుణం సంఘాల ఖాతాలలో జమ చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో విద్యావతి, ధనలక్ష్మి ఖైరున్నీసా, సీసీలు ఎంఎస్ అకౌంటెంట్, ఆపరేటర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండలాధ్యక్షురాలు

ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలే..

- కాంగ్రెస్ నాయకులు ధ్వజం

నవతెలంగాణ-ఆర్మూర్

9 సంవత్సరాలు పూర్తవుతున్నా ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలేదని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణంపై శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కోల వెంకటేష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిదిన్నర సంవత్సరాలు పూర్తి అయిన ఇప్పటివరకు నియోజకవర్గంలో లబ్ది దారులకు ఒక్క డబుల్ బెడ్ ఇల్లు ఇవ్వలేదని, డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాలు పూర్తి కాని నియోజకవర్గం ఏదైనా ఉంది అంటే అది ఆర్మూర్ నియోజకవర్గమేనని తెలిపారు. 2014 ఎన్నికల ప్రచారంలో మేనిఫెస్టోలో కేసీఆర్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లను అవహేళన చేస్తూ అల్లుడు వస్తే ఎక్కడ పడుకుంటారని అంటూ మేం అధికారంలోకి వస్తే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఇస్తానని అన్నాడని, కానీ ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే మాత్రం తన కోసం అంకాపూర్‌లో హైదరాబాద్‌లో ఇండ్లు నిర్మించుకున్నాడని, ఇవి కాక మినిస్టర్ క్వాటర్స్‌లో ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఇల్లు పొందాడు కానీ తనకు ఓట్లు వేసిన ప్రజలకు మాత్రం ఇప్పటివరకు ఒక్క ఇల్లు ఇవ్వలేదని అన్నారు. నాయకులు అజ్జు, జిమ్మి రవి, మందుల పోశెట్టి, బట్టు శంకర్, బాల కిషన్, పాషా, పెద్ద పోశెట్టి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోల వెంకటేష్

చదువుకున్న పాఠశాలకు ఎంత చేసినా తక్కువే

- 80 వేల విలువ గల క్రీడా సామగ్రి అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామంలో పుట్టి, ప్రభుత్వ పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకుని ఉన్నత స్థానంలో ఉన్న తాను చదువుకున్న పాఠశాలకు ఎంత చేసినా తక్కువేనని కుంట రాజిరెడ్డి అన్నారు. రూ.80 వేల విలువ గల క్రీడా సామగ్రిని సర్పంచ్ కుంట మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులకు అందజేశారు. ఎస్అండ్‌పీ గ్లోబల్ మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్న ఇందల్‌వాయి మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన కుంట రాజిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తన సొంత గ్రామమైన గన్నారం గ్రామానికి క్రీడా వస్తువులను అందజేయడం పట్ల పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాండ్ల భైరయ్య, వార్డ్ మెంబర్ పళ్ళ శేఖర్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు వీర లక్ష్మి, అధ్యాపక బృందం, రాజిరెడ్డి, చిన్ననాటి స్నేహితులు సతీష్, గణేష్, జీవన్‌రెడ్డి, క్రాంతి కుమార్‌రెడ్డి, నరేశ్, లక్ష్మి నర్సయ్య విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుంట రాజిరెడ్డి

బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలి : ఆర్డీవో

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాజకీయ పార్టీలు నాయకులు ఏజెంట్లను నియమించుకోవాలని ఎన్నికల సమయంలో అన్ని పార్టీలు అధికారులకు సహకరించాలని నిజామాబాద్ ఆర్డీఓ రవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఘన్పూర్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం స్థాయి పొలిటికల్ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లు, సూపర్వైజర్ ఆఫీసర్లతో శనివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో రవి మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా బీఎల్ఓలు నిర్వహించిన ఓటర్ లిస్ట్‌పై ఇంటింటికి సర్వే నిర్వహించామని, ఈ సర్వే శుక్రవారంతో ముగిసిందన్నారు. ప్రతి రాజకీయ పార్టీ వారి వారి బూత్ లెవెల్ ఏజెంట్‌ల నియామకం ఆవశ్యకతను వివరించారు. ఓటర్ లిస్టును తయారు చేయుటకు అధికారులకు సహకరించాలని కోరారు.

వ్యవసాయ కార్మికులకు సమగ్రమైన చట్టం తీసుకురావాలి

నవతెలంగాణ-రెంజల్

వ్యవసాయ కార్మికులకు సమగ్రమైన చట్టాన్ని తీసుకువచ్చి రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా డిమాండ్ చేసింది. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ రామచందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ కూలీలకు డబుల్ బెడ్ రూములు కేటాయించాలని, ఖాళీ స్థలాన్ని ఉన్న నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కూలీలకు పని దొరకకా నాన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నేడు వ్యవసాయ రంగంలో యంత్రాలు రావడంతో కూలీలకు పని దొరకకా పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.